నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, శనివారం 21 డిసెంబర్ 2024 | BHADRADRI KOTHAGUDEM


ఖమ్మం తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్న సండ్ర, చిత్రంలో లింగాల, కొండబాల, ఆర్‌జేసీ

# కేటీఆర్‌పై అక్రమ కేసు ఎత్తివేయాలి

- కాంగ్రెస్‌కు దమ్ముంటే అసెంబ్లీ సమావేశాల్లో చర్చ పెట్టాలి
- ‘ఈ-రేస్’ ద్వారా తెలంగాణకు పెరిగిన పెట్టుబడులు
- ప్రతిపక్ష నాయకులపై కేసులే టార్గెట్‌గా రేవంత్‌రెడ్డి తీరు
- కేసుల ద్వారా గులాబీ శ్రేణులను భయపెట్టలేరు
- బీఆర్‌ఎస్ నేతలు వెంకటవీరయ్య, కొండబాల, లింగాల

ఖమ్మం, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): హైదరాబాద్ నగరానికి విశ్వవ్యాప్త గుర్తింపు తీసుకురావడమే లక్ష్యంగా గత కేసీఆర్ ప్రభుత్వంలో నిర్వహించిన ఫార్ములా ఈ-రేస్‌ను అడ్డం పెట్టుకొని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసును వెంటనే ఎత్తివేయాలని బీఆర్‌ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య డిమాండ్ చేశారు. ఖమ్మంలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్రమ కేసులను బనాయించి బీఆర్‌ఎస్‌ను దెబ్బ తీయాలనే కుట్రలను తెలంగాణ ప్రజలు సహించరన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో తెలంగాణకు ప్రపంచవ్యాప్త గుర్తింపు తీసుకొచ్చిన ఘనత కేటీఆర్‌దే అన్నారు. ప్రభుత్వానికి ధైర్యముంటే ఫార్ములా అసెంబ్లీలో చర్చ పెట్టాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేక ప్రతిపక్ష నాయకులను టార్గెట్ చేసిందన్నారు. జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు మాట్లాడుతూ ఫార్ములా ఈ-రేస్‌ను కొనసాగిస్తే కేసీఆర్, కేటీఆర్‌కు ఎక్కడ మరింత మంచి పేరు వస్తుందోననే దురుద్దేశంతోనే కేసు పెట్టారని అన్నారు. మాజీ ఎమ్మెల్యే బానోతు చంద్రావతి మాట్లాడుతూ అక్రమ కేసుల ద్వారా బీఆర్‌ఎస్‌ను ఏమీ చేయలేరని, గులాబీ శ్రేణులను భయపెట్టలేరని స్పష్టం చేశారు. ఉద్యమకారులు, నేతలు ఉప్పల వెంకటరమణ, బొమ్మెర రామ్మూర్తి, ఆర్జేసీ కృష్ణ, బిచ్చాల తిరుమలరావు, శీలంశెట్టి వీరభద్రం, బెల్లం వేణు, ఎడ్డపల్లి వరప్రసాద్, తాజుద్దీన్, పద్మ, కృష్ణారావు పాల్గొన్నారు.

# డైవర్షన్ కోసమే కేటీఆర్‌పై కేసు: రేగా



మణుగూరు టౌన్, డిసెంబర్ 20: ఇచ్చిన హామీలు అమలు చేయలేక ప్రజల నుంచి వ్యతిరేకత వస్తున్నందున దానిని డైవర్షన్ చేయడానికే కేటీఆర్‌పై అక్రమ కేసు నమోదు చేయించారని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు ఆరోపించారు. అక్రమంగా కేసులు బనాయిస్తే రేవంత్ ప్రభుత్వానికి కోర్టులో మొట్టికాయలు తప్పవని స్పష్టం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఫార్ములా -ఈ రేస్ నిర్వహించిన కేటీఆర్.. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచితే.. అందులో అవినీతి జరిగిందని రేవంత్ రెడ్డి అడ్డంగా వాదిస్తున్నారని అన్నారు. ఈ ప్రభుత్వానికి బీఆర్‌ఎస్ మీద కక్ష తప్ప ప్రజాపాలన మీద దృష్టి లేదని ఆరోపించారు. విజ్ఞులైన ప్రజలు అన్నీ గమనిస్తూనే ఉన్నారని అన్నారు. ఇప్పటికైనా కేటీఆర్ మీద పెట్టిన కేసు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే ప్రజలు, బీఆర్‌ఎస్ కార్యకర్తల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

# కేటీఆర్‌పై కేసు హేయమైన చర్య: వనమా



భద్రాద్రి కొత్తగూడెం, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ): డైవర్షన్ పాలిటిక్స్ నడుపుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై అక్రమ కేసు పెట్టించడం హేయమైన చర్య అని మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి సర్కార్ ఆటవిక పాలన సాగిస్తున్నదని ధ్వజమెత్తారు. ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలు చేయలేక ప్రతిపక్ష పార్టీల నేతలపై తప్పుడు కేసులు బనాయించి.. కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. నిత్యం ప్రజల పక్షాన నిలుస్తున్న కేటీఆర్‌కు వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక ఆయన ప్రతిష్టను దిగజార్చే ప్రయత్నం చేస్తున్నారని, ఇవన్నీ విజ్ఞులైన తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. కేటీఆర్‌తోపాటు బీఆర్‌ఎస్ నేతలపై పెట్టిన తప్పుడు కేసులు విరమించుకొని.. ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

# వారంలో సెట్ కాకపోతే చర్యలు తప్పవు

- పై అధికారి నుంచి కిందిస్థాయి వరకు ప్రక్షాళన చేస్తా
- ఎంసీహెచ్ సూపరింటెండెంట్‌పై కలెక్టర్ ఆగ్రహం


రామవరం ఎంసీహెచ్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్

భద్రాద్రి కొత్తగూడెం, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ): ‘రక్త పరీక్షలు చేయమంటే బయటకు వెళ్లమని చెబుతారు. ఏ మందులు ఆస్పత్రిలో లేవు.. బయటకు వెళ్లి తెచ్చుకోవాలంటారు. పిల్లలకు వేసే చుక్కల మందు కూడా బయటే తీసుకు రావాలంటారు. కనీసం ఎక్స్‌రే కూడా లేదని చెబుతారా?’ అంటూ కలెక్టర్ జితేశ్ వి పాటిల్.. రామవరం మాతా, శిశు ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని రామవరం మాతా, శిశు ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్‌కు పలువురు రోగులు ఆసుపత్రి సిబ్బంది పనితీరు, నిర్లక్ష్యంపై నేరుగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ‘మీకు వారం టైం ఇస్తున్నా. అన్నీ సెట్ అవ్వకపోతే ఎవర్నీ వదలా. మీ మీద ఒక సూపర్‌వైజర్‌ను పెడతా’ అని హెచ్చరించారు. నిరుపేద రోగులు ఆస్పత్రికి వస్తే.. బయట రక్త పరీక్షలు చేయించుకోవాలని రాస్తారా.. ఆ డాక్టర్‌కు షోకాజ్ నోటీసు ఇవ్వాలని ఆదేశించారు. అందర్నీ సస్పెండ్ చేసుకుంటూ పోతే ఇక ఆసుపత్రి ఉండదని చూస్తున్నా, ఇక ఉపేక్షించేది లేదు. పై అధికారి నుంచి కిందిస్థాయి వరకు ప్రక్షాళన చేస్తానన్నారు. ఆసుపత్రిలో మందులు లేకపోతే ఇండెంట్ పెట్టి తెప్పించుకోవాలన్నారు. నువ్వు ఏమన్నా డీఎంఈవా లేక హైదరాబాద్‌లో ఉంటున్నావా.. మందులు కూడా చెక్ చేసుకోలేకపోతున్నావా.. అని సూపరింటెండెంట్‌పై సీరియస్ అయ్యారు. కలెక్టర్ వెంట డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్‌నాయక్, డీసీహెచ్‌ఎస్ రవిబాబు తదితరులు ఉన్నారు.

- నిలిచిపోయిన బీసీల ఆత్మగౌరవ భవన నిర్మాణం
- బీఆర్‌ఎస్ పాలనలో 70 శాతం పూర్తయిన పనులు
- మిగిలిన 30 శాతం పూర్తి చేయలేని కాంగ్రెస్ సర్కార్
- ముగ్గురు మంత్రులున్నా.. ముగింపు పనులు శూన్యం..
- బీసీలపై సవతి తల్లి ప్రేమను చూపిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన భవనం

ఖమ్మం జిల్లాలో బీసీల ఆత్మగౌరవ భవనం అసంపూర్తిగా దర్శనమిస్తున్నది. నాటి బీఆర్‌ఎస్ సర్కార్ పాలనలో భవన నిర్మాణం ప్రారంభమై 70 శాతం పనులు పూర్తయినప్పటికీ మిగిలిన 30 శాతం పనులను నేటి కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేయలేకపోతున్నది. కేసీఆర్ నాయకత్వంలో నాడు బీసీల సర్వతోముఖాభివృద్ధికి విశేష కృషి జరిగింది. తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా కేసీఆర్ రాష్ట్ర రాజధానిలో వివిధ వర్గాలకు ఉపయోగకరంగా ఉండేందుకు ఆత్మగౌరవ భవనాలను నిర్మించారు. అదే తరహాలో జిల్లా కేంద్రాల్లోనూ ఆయా వర్గాల అవసరాల నిమిత్తం ఆత్మగౌరవ భవనాలను నిర్మించారు. కొన్ని జిల్లాల్లో భవనాలు అందుబాటులోకి రాగా.. సేవలు సైతం పొందుతున్నారు. ఖమ్మం జిల్లాలో కూడా బీసీ భవన నిర్మాణానికి రూ.2 కోట్ల నిధులు మంజూరు చేయగా.. జిల్లా పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో బీసీ సంక్షేమ శాఖ పర్యవేక్షణలో పనులు ప్రారంభించారు.

-మామిళ్లగూడెం, డిసెంబర్ 20

# ఏడాది దాటినా.. అసంపూర్తే..


ఖమ్మంలో నిర్మాణంలో ఉన్న బీసీల ఆత్మగౌరవ భవన ప్రాంగణంలో దుస్థితి

నాటి మంత్రులు వి.శ్రీనివాస్‌గౌడ్, పువ్వాడ అజయ్‌కుమార్‌లు 2021 జనవరి 1న ఖమ్మం జిల్లా కేంద్రంలోని బీసీల ఆత్మగౌరవ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. పనులు ప్రారంభించిన పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ నిర్దేశిత గడువులోగా దాదాపు 70 శాతం పనులను పూర్తి చేసింది. ఆ సమయంలోనే రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరిగి కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో భవన నిర్మాణ పనులు అటకెక్కాయి. పనులు చేపడుతున్న గుత్తేదారు బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి అనుకూల వ్యక్తి అనే కారణంతో పనులు నిలిపివేయాలని కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు మౌఖిక ఆదేశాలు జారీ చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ఖమ్మం బైపాస్ రోడ్డులో భవనం అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నది.

### శాఖల సమన్వయ లోపం..

బీసీ ఆత్మగౌరవ భవన నిర్మాణ పనులను పూర్తి చేయడంలో బీసీ సంక్షేమ శాఖ, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖల మధ్య సమన్వయం లోపించింది. ఉన్న నిధులతో ఎంతమేరకు పనులు చేయవచ్చో ఆ పనులను కొనసాగిస్తూ అవసరమైన నిధుల కోసం ప్రతిపాదనలు పంపించాల్సిన రెండు శాఖల అధికారులు ఆ భవనంవైపు కన్నెత్తి కూడా చూడడం లేదు.

### బీసీలపై సవతి తల్లి ప్రేమ..

జిల్లాలో ముగ్గురు మంత్రులు పేరుకు మాత్రమే ఉండి అధికార దర్పాన్ని ప్రదర్శిస్తున్నారు. బీసీలను ఓటు బ్యాంకుగా వినియోగించుకున్న సదరు అమాత్యులు వారి అభివృద్ధిని మాత్రం మర్చిపోయారు. జిల్లా కేంద్రంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బీసీల భవన నిర్మాణం పూర్తి చేయడానికి ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం శోచనీయం. కాంగ్రెస్ జెండాను భుజాన మోస్తున్న బీసీ నాయకులు సైతం నోరు మెదపడం లేదు.

### అసాంఘిక కార్యకలాపాలు..

ఖమ్మం నగరంలోని బైపాస్ రోడ్డు పక్కనే ఎన్‌టీఆర్, తెలంగాణ తల్లి సర్కిల్‌కు దగ్గరలో నిర్మాణంలో ఉన్న బీసీ భవనం ప్రస్తుతం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. భవన నిర్మాణం గత ఏడాది కాలంగా నిలిచిపోవడంతో మందుబాబులకు అడ్డాగా మారింది. ఇదే అదునుగా భావించిన కొందరు మినీ లారీ యజమానులు తమ వాహనాలను పార్కింగ్ చేస్తూ అడ్డాగా మార్చారు. భవనం లోపల మద్యం సీసాలతోపాటు అశ్లీల, అసాంఘిక కార్యకలాపాల ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. ఇంకొన్ని నెలలు ఇలానే వదిలేస్తే భవనం శిథిలావస్థకు చేరనున్నది.

### కొరవడిన ఐక్యత..

బీసీల ఆత్మగౌరవ పతాకగా జిల్లా కేంద్రంలో నిలవాల్సిన భవనం నేడు అసంపూర్తిగా నిధుల కోసం ఎదురుచూస్తోంది. బీసీల కార్యకలాపాలు, తమ వర్గాల అవసరాలు, పిల్లల భవిష్యత్తు అవసరాలకు ఉపయోగపడాల్సిన భవనం అసంపూర్తి గోడలతో కనిపిస్తున్నది. తమ ఆత్మగౌరవ భవన నిర్మాణం పూర్తి చేసేందుకు ప్రభుత్వ పెద్దలతో కొట్లాడాల్సిన బీసీ వర్గాల్లో ఐక్యత లోపించిందనే చెప్పవచ్చు.

### టెండర్లు నిలిచిపోయాయి..

ఖమ్మంలోని బీసీ ఆత్మగౌరవ భవన నిర్మాణ మిగిలిన పనులకు టెండర్లను ప్రభుత్వం నిలిపివేసింది. సీఎం గ్యారెంటీ పథకంలో రెండు కోట్లతో పనులు జరిగాయి. మిలిగిన పనులకు అంచనాలు రూపొందించి పంపించడంతో సుడా నుంచి రూ.1.30 కోట్లు మంజూరు చేశారు. వాటికి టెండర్ల ప్రక్రియ చేపట్టే సమయంలో ప్రభుత్వ అనుమతులు లభించకపోవడంతో నిలిపివేశాం.

-మహేశ్‌బాబు, పీఆర్ డీఈ





# పోటాపోటీగా గురుకులాల రాష్ట్రస్థాయి క్రీడలు


కబడ్డీ పోటీలో తలపడుతున్న జోన్-3, జోన్-5 క్రీడాకారులు

పాల్వంచ రూరల్, డిసెంబర్ 20: పదో రాష్ట్రస్థాయి సోషల్ వెల్ఫేర్ క్రీడలు లక్ష్మీదేవిపల్లి (ఎస్)లోని సోషల్ వెల్ఫేర్ పాఠశాల, కళాశాల క్రీడా మైదానంలో శుక్రవారం రెండో రోజుకు చేరాయి. దాదాపు 13 అంశాల్లో వివిధ జోన్ల మధ్య కొనసాగుతున్న ఆటలు ఉత్సాహభరితంగా.. పోటాపోటీగా సాగుతున్నాయి. రన్నింగ్, లాంగ్ జంప్, షాట్‌పుట్, టెన్నికాయిట్, క్యారమ్స్ విభాగాల్లో పోటీలు ముగిశాయి.విజేతలకు సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ జాయింట్ సెక్రటరీ సక్రునాయక్ బహుమతులు అందించారు. కార్యక్రమంలో క్రీడా అధికారులు కంపాటి అలివేలు, కొప్పుల స్వరూపరాణి, కొత్తపల్లి ప్రత్యూష, విద్యారాణి, క్రీడల నిర్వహణ అధికారులు శంకర్, జి.శ్రీనివాస్, కె.వాసు తదితరులు పాల్గొన్నారు.


వివిధ క్రీడాపోటీల్లోని విజేతలతో క్రీడల అధికారులు

**విజేతల వివరాలు ఇలా..**

**అండర్-14 రన్నింగ్ విభాగంలో:** విశాల్ (జోగులాంబ), నితిన్ (భద్రాద్రి) రాకేష్ (కాళేశ్వరం) జోన్ల క్రీడాకారులు మొదటి మూడు స్థానాలు సాధించారు.

**లాంగ్ జంప్‌లో:** నితిన్, చరణ్ (కాళేశ్వరం) ప్రవీణ్ (జోగులాంబ) జోన్ల క్రీడాకారులు మూడు స్థానాల్లో నిలిచారు.

**షాట్‌పుట్‌లో:** మహేష్ (యాదాద్రి), ప్రవీణ్ (జోగులాంబ), తేజ (యాదాద్రి) జోన్ల క్రీడాకారులు విజయం సాధించారు.

**5000 మీటర్ల రన్నింగ్‌లో:** శివకుమార్ (జోగులాంబ), గోపిచంద్ (యాదాద్రి), అనిల్ (జోగులాంబ) విజయం సాధించారు.

**లాంగ్ జంప్‌లో:** ఏ.గణేశ్ (జోగులాంబ), ఉదయ్‌కిరణ్ (జోగులాంబ), డి.గణేశ్ (కాళేశ్వరం) జోన్ల క్రీడాకారులు విజేతలుగా నిలిచారు.

# అపరిమిత వైద్యం చేయొద్దు: డీఎంహెచ్‌వో


కిడ్నీ వ్యాధిగ్రస్తుడితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

జూలూరుపాడు, డిసెంబర్ 20: పల్లెల్లో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న గ్రామీణ వైద్యులు.. పరిమితికి మించిన వైద్యం చేస్తే చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్ నాయక్ హెచ్చరించారు. మండలంలోని అనంతారంలో ఇటీవల ఇద్దరు కిడ్నీ బాధితులు మృతిచెందారు. ఈ గ్రామంలో కిడ్నీ బాధితుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో శుక్రవారం అక్కడకు ఆయన వెళ్లారు. కిడ్నీ బాధితుల ఇండ్లకు వెళ్లి వారి రిపోర్టులను పరిశీలించారు. కొందరు గ్రామీణ వైద్యులు అధిక మోతాదున్న ఇంజక్షన్లు ఇచ్చి ఉంటారని అన్నారు.

# ఆటోడ్రైవర్ల ముందస్తు అరెస్టు


కొత్తగూడెం టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో జేఏసీ నాయకులు

రామవరం, డిసెంబర్ 20 : ఆటో డ్రైవర్ల అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర జేఏసీ ఇచ్చిన పిలుపులో భాగంగా ‘చలో అసెంబ్లీ’ కార్యక్రమం కోసం హైదరాబాద్ వెళ్తున్న జిల్లా ఆటో డ్రైవర్లను కొత్తగూడెం టూటౌన్ పోలీసులు శుక్రవారం అక్రమంగా అరెస్టు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కంచర్ల జమలయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.12 వేల చొప్పున ఇస్తామన్న హామీని తక్షణమే అమలు చేయాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం చలో అసెంబ్లీకి వెళ్తున్న ఆటో డ్రైవర్లను నిర్బంధించడం సరికాదన్నారు. మర్రి కృష్ణ, చిట్టూరి అబ్బులు, జనార్దన్, గోపి, వెంకన్న, అదోవి పాల్గొన్నారు.

# అమిత్‌షా వ్యాఖ్యలపై నిరసనల వెల్లువ


- అన్ని మండలాల్లో కేంద్ర మంత్రి దిష్టిబొమ్మల దహనాలు
- ప్లకార్డులతో ప్రదర్శనలు.. నల్ల బ్యాడ్జీలు ధరించి నినాదాలు..





కొత్తగూడెంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాలమహానాడు సంఘం నేతలు, చంద్రుగొండలో అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నేతలు

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను పార్లమెంటులో కేంద్ర మంత్రి అమిత్‌షా అవమానించడాన్ని నిరసిస్తూ జిల్లాలోని పలు మండలాల్లో మాలమహానాడు నేతలు ఆయన దిష్టిబొమ్మను శుక్రవారం దహనం చేశారు. చంద్రుగొండలో మాల మహానాడు నాయకులు అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. జూలూరుపాడులో అంబేద్కర్ విగ్రహం వద్ద ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. పాల్వంచలో నల్ల బ్యాడ్జీలు ధరించి అమిత్‌షాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కొత్తగూడెంలో అంబేద్కర్ విగ్రహం వద్ద ఎస్సీ వర్గీకరణ పోరాట సమితి నేతలు నివాళులర్పించారు.

-చంద్రుగొండ/ జూలూరుపాడు/ పాల్వంచ టౌన్/ కొత్తగూడెం అర్బన్, డిసెంబర్ 20




పాల్వంచ అంబేద్కర్ సెంటర్‌లో ప్రధాన సెంటర్‌లో అమిత్‌షాకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న మాలమహానాడు నాయకులు, జూలూరుపాడు: రాజ్యాంగ నిర్మాత విగ్రహం వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలుపుతున్న నాయకులు

